# అడకత్తెరలో ఇజ్రాయిల్

నేనూ, మార్టీ, ఆండ్రూ లండన్ హీత్రూ ఎయిర్‌పోర్ట్‌లో ఎల్‌యాల్ విమానం ఎక్కటానికి టెర్మినల్‌కి వచ్చాం. ఎల్‌యాల్ ఇజ్రాయిల్ గవర్నమెంట్ నడిపే విమాన సర్వీస్. వాళ్ళ సెక్యూరిటీ క్లియరెన్స్‌కి చాల టైమ్ పడుతుంది, ముందే రమ్మని చెప్పటంవల్ల లండన్‌లో పని పూర్తిచేసుకుని, మూడు గంటల ముందే అక్కడికి వచ్చాం. ఇజ్రాయిల్ సెక్యూరిటీ లండన్‌లోనే మొదలయింది.

అన్నిదేశాల్లోలా అక్కడ కౌంటర్లు లేవు. చాల డెస్క్‌లూ, ప్రతి డెస్క్ దగ్గరా అటొకటీ ఇటొకటీ కుర్చీలు. మా ముగ్గుర్తోపాటూ ఫీనిక్స్‌నించీ వచ్చిన ఒక అమెరికన్ అమ్మాయి లీసా కూడా వుంది. ఆ కాసేపటిలోనే స్నేహంగా సరదాగా మాట్లాడటం మొదలుపెట్టింది. మేం నలుగురం కలిసి అక్కడికెళ్ళగానే, ఒక సెక్యూరిటీ అమ్మాయి వచ్చి, ఆండ్రూని అడిగింది, మీరందరూ ఒక గ్రూపా అని. అతను మేమ్ముగ్గురం ఒకే కంపెనీకి పనిచేస్తున్నామనీ, ఆఫీసు పనిమీద కలిసి వచ్చామనీ చెప్పాడు. అది విని ఇంకో ఇద్దరమ్మాయిలు వచ్చి మా ముగ్గుర్నీ దూరందూరంగా వున్న మూడు డెస్క్‌ల దగ్గరికి తీసుకువెళ్ళారు.

నేను కూర్చోగానే ఆ అమ్మాయి "మా దేశాన్ని నాశనం చేయాలని చాల మంది టెర్రరిస్టులు ఎదురుచూస్తున్నారు. మా దేశరక్షణే మాకు ముఖ్యం. అందుకని మిమ్మల్ని దాదాపు గంటసేపు ప్రశ్నలడుగుతాను. మీకభ్యంతరం లేదు కదా" అంది.

అభ్యంతరం వుందని ఎలా అంటాను అందుకే అలాగే అన్నాను. నా పేరూ వూరూ దగ్గర మొదలుపెట్టి, వాళ్ళ దేశానికి మేం ఎందుకువెడుతున్నామూ, అక్కడేమిటి పనీ, ఏ ఆఫీసుకి వెడుతున్నాం, ఏ హోటల్లోవుంటాం, ఎన్నాళ్ళు వుంటాం, మేం కలవబోయేవాళ్ళ బిజినెస్ కార్డులు మా దగ్గర వున్నాయా, వాళ్ళెవరు, పేర్లూ ఉద్యోగాలూ ఏమిటిలాటి లక్షా తొంభై ప్రశ్నలు అడిగి, జవాబులు వినటమే కాకుం

డా అన్నీ ఓపిగ్గా వ్రాసుకుంది. నేను అక్కడ వాళ్ళకి ట్రైనింగ్ ఇవ్వటానికి వచ్చానని చెబితే, మరి ముగ్గురెందుకు ఒకళ్ళు చాలరా అని అడిగింది. మేం ముగ్గురం వేరే విషయాల మీద ట్రైనింగ్ ఇస్తున్నామనీ అందుకే అంత ఖర్చుపెట్టుకుని అక్కడికి వచ్చామనీ చెప్పాను. ట్రైనింగ్ మెటీరియల్ అడిగి తీసుకుని, పేజీలు తిప్పి చూసింది. అదయాక ఆ అమ్మాయి, మిగతా ఇద్దరమ్మాయిలూ, మధ్యలో ఒకచోట చేరి, మేం ముగ్గురం చెప్పిన జవాబులు అన్నీ ఒకటిగానే వున్నాయని రూఢి చేసుకుని కానీ, మమ్మల్ని విమానం ఎక్కనీయలేదు.

విమానం ఎక్కిన అరగంటకి, పరుగెత్తుకుంటూ వచ్చింది లీసా. "నేను మళ్ళీ ఇజ్రాయిల్‌కి మాత్రం చస్తే రాను" అంది కోపంగా.

"ఏమయింది?" అడిగాను.

"ఏమవుతుంది. నన్ను రిసీవ్ చేసుకోటానికి వచ్చే అతని పేరు కావాలిట. నేనేమో మిషనరీ పనిమీద వస్తున్నాను. అక్కడినించీ ఎవరొస్తారో నాకేం తెలుసు. ఏ హోటల్లో వుంటానో చెప్పమంటారు. నాకేం తెలుసు ఎక్కడ బుక్‌చేశారో?.... " బుసలు కొడుతున్నది లీసా. అంతా అర్థమయి, ఏమనాలో తెలీక వూరుకున్నాను.

టెల్‌ఎవీవ్‌లో మెడిటెర్రేనియన్ సముద్రపు ఒడ్డునే మా షెరటాన్ హోటల్. అక్కడ పదో అంతస్థులోని, నా గది కిటికీలోనించీ చూస్తుంటే, నింగిలోని నీలాకాశం నీలి సముద్రంలో కలిసిపోయి, ఎంతో ప్రశాంతంగా వుంది. పేపర్లలో చదివిన ఇజ్రాయిల్‌లా లేనే లేదు. ఎక్కడ చూసినా శవాలూ బాంబుల దెబ్బతిని కూలిపోయిన బిల్డింగులూలాటివి నాకెక్కడా కనపడలేదు. అవన్నీ ఇజ్రాయిల్ రాజధాని జెరూసేలమ్‌లో కనిపిస్తాయేమో అనిపించింది.

ఇరవై వేల ఏడువందల చదరపు కిలోమీటర్ల చిన్నదేశం. ఆరు మిలియన్లపైన జనాభా. ఇక్కడ ఎక్కువమంది జనాభా మాట్లాడే భాష హీబ్రూ. దాని తర్వాత అరబిక్. హీబ్రూని, అరబిక్‌లాగా ఉర్దూలాగా కుడి పక్కనించీ, ఎడమ పక్కకి వ్రాస్తారు. ఇక్కడ చదువుకున్నవారి సంఖ్య 95 శాతం. ఎడారిలో పచ్చటి పొలాలు నిర్మించి ఆహారం పండించిన దేశం. ఆర్థికంగా సాంకేతికంగా చాలముందుకి వెళ్ళిన దేశం. అంతేకాకుండా ఇజ్రాయిల్ చాల అందమైనది.

మే 15, 1948లో అరబ్ దేశాలనట్టనడుమ అవతరించింది ఇజ్రాయిల్. అడకత్తెరలో పోకచెక్కలా. ఆ దేశం పుట్టినపురిటి వాసన పూర్తిగా పోకముందే, చుట్టుపక్కల అరబ్ దేశాలన్నీ ఇజ్రాయిల్‌తో యుద్ధానికి దిగాయి. ఇజ్రాయిల్‌కూడా వూరుకోలేదు. వాళ్ళని ఎదురుదెబ్బ గట్టిగానే కొట్టి, జనవరి 1949లో కొంత ప్రదేశం ఆక్రమించింది కూడా. తర్వాత వరసగా ఈజిప్ట్ జోర్డాన్ లెబనాన్ సిరియాలాటి అరబ్ దేశాలతోయుద్ధాలు తప్పలేదు. 1967లో ఇజ్రాయిల్ గాజాస్ట్రిప్, వెస్ట్ బాంక్‌లని ఆక్రమించింది. తర్వాత ఈజిప్ట్‌తో 1978లో శాంతియుత పరిష్కారం చేసుకుంది. ఇలా ముళ్ళ రోడ్డుమీద తన రాజకీయ జీవితం మొదలుపెట్టి,ఎన్నో ఢక్కామక్కీలు తిన్న ఇజ్రాయిల్, ఆగస్ట్ 30 1993లో పాలస్టీన్ వారికి వేరేదేశాన్ని నిర్మించటానికి ఒప్పుకుంది. చుట్టుపక్కల దేశాలతో శాంతి పరిష్కారాలకి సంతకాలు చేసింది. అయినా,

ఆ ప్రాంతంలో ప్రతిరోజూ ఏదో సంఘటన, దుర్ఘటన అనాలా, జరుగుతూనే వుంది.

ఇజ్రాయిల్ సాఫ్ట్‌వేర్ ఎగుమతులలో ప్రథమ స్థానంలోవుంది. వాళ్ళు సాఫ్ట్‌వేర్ నిపుణులను ఇతర దేశాలకి పంపించటంకన్నా ఆ కంపెనీలనీ ఉద్యోగాలనీ ఇజ్రాయిల్‌కే రప్పించుకోవటం దానికి కారణం. ఎక్కడ చూసినా అమెరికన్, యూరోపియన్, ఆసియా సాఫ్ట్‌వేర్ కంపెనీలే కనిపిస్తాయి. అన్ని వూళ్ళూ అందంగా శుభ్రంగా వుంటాయి. జ్యూయిష్‌వారు చాల సనాతనులనీ ఆచారాలు పాటించే మనుష్యులనీ అనుకున్న మాకలాటివేమీ కనపడలేదు. ఎక్కడ చూసినా బార్లు, నైట్‌క్లబ్బులు పాప్ మ్యూజిక్, ఉత్సాహంగా కావలించుకుని నడిచే యువతీయువకులూ కనపడ్డారు. జ్యూయిష్ ప్రజలు స్వతహాగా తెలివైనవాళ్ళు. స్నేహంగా మాట్లాడతారు. వ్యాపారం చేయటంలో వీళ్ళని మించినవాళ్ళు లేరు. సైన్స్, సంగీతం, సాహిత్యం, సినిమాలు, వాల్‌స్ట్రీట్ మొదలైన రంగాలలో, జ్యూయిష్‌వారు చాల ప్రముఖులు. ఆల్‌బర్ట్ ఐన్‌స్టీన్, మోజార్ట్, బీథోవిన్, స్టీవెన్ స్పీల్‌బర్గ్, ఊపీ గోల్డ్‌బర్గ్, నికోల్ కిడ్‌మన్, టామ్ హాంక్స్, గోల్డ్‌మెన్ శాక్స్, ఛార్లస్ ష్వాబ్‌లాటి పేర్లు గుర్తుకు తెచ్చుకుంటే, ఈ జాతి సత్తా ఏమిటో తెలుస్తుంది. జ్యూయిష్‌వారు తెలివితేటల్ని నామమాత్రంగా మాత్రమే వుంచుకోకుండా, వాటిని పూర్తిగా ఉపయోగించుకుని, కష్టపడి పనిచేస్తారు. అన్నిటికీ మించి మరాభిమానం, దేశాభిమానం వాళ్ళకి పుష్కలంగా వుంది.

వాళ్ళకి శుక్రవారం, శనివారాలు వారాంతం కింద లెఖ్క. ఆదివారం పనిచేసే రోజు. శుక్రవారం పొద్దున్నే మేం ముగ్గురం, అక్కడి మా ఆఫీసులోనే పనిచేసేబాబ్‌తో కలిసి, వాన్ బుక్ చేసుకుని జెరూసేలం వెళ్ళాం. ప్రపంచంలోని ఐదు పెద్దమతాలలోనూ మూడు, అంటే జుడాయిజం, క్రిస్టియానిటీ, ఇస్లామ్ మతాల పుట్టిల్లు జెరూసేలం. ఒక పక్క జ్యూయిష్ క్వార్టర్స్, ఒక పక్క చర్చి,ఇంకో పక్క మసీదూ, ఆవూరికి మంచి అందాన్నివ్వటమే కాకుండా చరిత్ర తెలిసినవారికి ఒళ్ళు పులకరింపచేస్తుంది. ప్రపంచంలోనే అద్భుతమైన వూరది. కాకపోతే, అన్ని మతాల నూకలిపి, మానవత్వానికే గుడి కట్టవలసిన ఆ ప్రదేశంలో, మతపిచ్చి రాజకీయాలతోకొట్టుకు చావటాలు చూస్తే, మతానికి అసలు అర్ధమేమిటి బ్రతకటానికి మతమవసరమా అన్న ఆలోచన ఎవరికైనా రాకమానదు. ఏసుక్రీస్తు పుట్టిన చోటు, చనిపోయినచోటు, ఆయన్ని దహనం చేసినచోటు చూస్తుంటే తన్మయత్వం వస్తుంది.

అన్నిటికన్నా నన్ను కదిలించింది హోలోకేస్ట్ మ్యూజియం. హిట్లర్ ద్వేషంతో, కొన్ని లక్షలమంది జ్యూలని అమానుషంగా చంపి వేసిన కథలు చాల విన్నాను. సినిమాల్లో చూశాను. కానీ ఈమ్యూజియంలో అడుగుపెట్టిన మరుక్షణంనించీ మనసు వికలమై హృదయం బరువెక్కిపోతుంది. హిట్లర్ ఊచకోత కోసిన జ్యూలు ఎంతమందో వ్రాసిన రాతి ఫలకం అక్కడవుంది. జర్మనీలో ఐదు లక్షలు, పోలెండ్‌లో 33 లక్షలు, రష్యాలో 30 లక్షలు, రుమేనియాలో 8 లక్షలు, ఫ్రాన్స్‌లో2.6 లక్షలు, ఆస్ట్రియాలో లక్షా ఎనభై వేలు, టర్కీలో 80 వేలు, స్పెయిన్‌లో 4 వేలు, డెన్మార్క్‌లో 8 వేలు, స్వీడెన్‌లో 7 వేలు, ఇలా హిట్లర్ ఒక జాతినే పూర్తిగా రూపుమాపాలని చేసిన

వేలు, స్వీడెన్‌లో 7 వేలు, ఇలా హిట్లర్ ఒక జాతినే పూర్తిగా రూపుమాపాలని చేసిన ప్రయత్నం. ముఖ్యంగా అలా చంపబడిన లక్షలాది అమాయకులైన చిన్నపిల్లల్నీ పసిపిల్లల్నీ, దైన్యంగావున్న వాళ్ళ ముఖాలనీ, బూడిదరంగు రాయిలో చెక్కిన ఒక పెద్ద శిల్పం. అక్కడనించి కదలలేక, అలానే ఒక అరగంట సేపు, కళ్ళల్లో నీళ్ళతో ఆ అమాయకుల కళ్ళల్లోకి చూస్తూ నుంచున్నాను. మానవత్వాన్ని పాతాళలోకాని కన్నా అథోగతిలోకి నెట్టిన చారిత్రాత్మక దుర్ఘటన అది. ఆనాటి ఆ సంఘటనకీ, ఈ నాడు అమెరికాలోనూ ఇండియాలోనూ ఇతర దేశాల్లోనూ జరుగుతున్న జిహాద్ కీ తేడా ఏమిటి అన్న ఆలోచనకూడా వచ్చింది నాకు.

మధ్యాహ్నం అక్కడ తిన్న భోజనం ఇంకొక అనుభవం. అక్కడ శాకాహారం దొరుకుతుందో లేదోనని అనుకున్న నాకు, శాకాహారంలో అన్నిరకాల వంటలు వుంటాయని అప్పటిదాకా తెలియలేదు. అటు లెబనీస్, అరబిక్, ఇటు ఇజ్రాయిల్ వంటలలోని రకరకాల పదార్థాలు రుచి చూశాను.

వచ్చేటప్పుడు షాపింగ్‌కూడా చేశాం. అక్కడే కొన్నాను తెల్లటి కొయ్యతో చేసిన ఒంటె. చాల బాగుంది. మళ్ళీ ఎల్‌ఆల్ ఎయిర్‌లైన్స్ అమ్మాయి, ఒక అరగంట కూర్చోబెట్టి మేము ఇజ్రాయిల్‌లో ఏమేంచేశామో ఎవరెవర్నికలిశామో, మా ప్రయాణం ఎలా జరిగిందో అన్నీ అడిగింది. నిజం చెప్పొద్దూ, మా ఆవిడ కూడా అన్ని ప్రయాణ విశేషాలు ఎప్పుడూ నన్నడగలేదు. చెప్పాక, ఆ అమ్మాయి అడిగింది, మీరు అక్కడేమైనా కొన్నారా అని. చెప్పాను. వెంటనే ఆ ఒంటెని తీసుకుని, దానికి రకరకాల కోణాలలో ఎక్స్‌రేలు తీసి, దాంట్లో బాంబులేవీ లేవని నిర్ధారణ చేసుకున్న తర్వాతే ఆ బొమ్మని నాకు అందించింది.

ఇక్కడ ఒక విషయం చెప్పాలి. ఇజ్రాయిల్‌ని, ఆ దేశ ప్రజలనీ చంపాలని, ఎంతోమంది ఆత్మహత్య చేసుకోవటానికి కూడా వెనుకాడని మతోన్మాదులు, ప్రతిరోజూ అవకాశాలకోసం ఎదురుచూస్తున్నా ఇంతవరకూ ఎల్‌ఆల్ ఎయిర్‌లైన్స్ వారి విమానాలు హైజాకింగ్‌లోకానీ, బాంబింగ్‌లోకానీ విధ్వంశం కాలేదు. దానికికారణం ఈ గట్టి సెక్యూరిటీనే.

మేము విమానం ఎక్కుతున్నప్పుడే, పరుగెత్తుకుంటూ వచ్చింది లీసా.

ఆమెను చూసి చేయి వూపాను. దగ్గరకి వచ్చి నవ్వింది.

"ఎలావుంది ఇజ్రాయిల్?" అని అడిగాను నవ్వుతూ.

"బ్రహ్మాండంగా వుంది. మళ్ళీమళ్ళీ రావాలనివుంది!" అని మళ్ళీ నవ్వింది.

* * *